సాక్షి
విజయనగరం
గురువారం । 2 । మార్చి । 2023



బాలలూ భళా..!

బొబ్బిలి మండలం కోమటపల్లికి చెందిన చిన్నారులు అంతరించి పోతున్న పల్లెకళలను బతికిస్తూ, అందరినీ అలరిస్తున్నారు. - 8లో



పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిషేధం

పాఠశాలల ప్రాంగణాల్లో ఎన్నికల ప్రచారాలు నిషేధమని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) ఎం.కె మీనా స్పష్టం చేశారు. - 8లో



బొబ్బిలి వీణలకు ఆర్డర్

బొబ్బిలి రూరల్: విశాఖపట్నంలో ఈ నెల 3, 4 తేదీల్లో జరగనున్న పారిశ్రామిక సదస్సులో పాల్గొనే అతిథులకు జ్ఞాపికలుగా ఇచ్చేందుకు 300 బొబ్బిలి వీణలకు ఆర్డర్ వచ్చింది. గొల్లపల్లికి చెందిన తయారీదారులు వీటిని సిద్ధం చేశారు.

న్యూస్‌రీల్

జిల్లా యువజన అధికారిగా కె.వెంకట్ ఉజ్వల్



విజయనగరం: నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారిగా కె.వెంకట్ ఉజ్వల్ నియామకమయ్యారు. శ్రీకాకుళం జిల్లా యువజన అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఉజ్వల్‌కు విజయనగరం జిల్లా అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఎ.సూర్యకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యాలయ గణాంకఅధికారి వి.పృధ్వీ, యువజన సంఘాల ప్రతినిధులు ఉజ్వల్‌ను అభినందించారు. ఇప్పటివరకు విజయనగరం యువజన అధికారిగా విధులు నిర్వహించిన విక్రమాదిత్య హైదరాబాద్‌కు బదిలీఅయ్యారు.

సమయపాలన తప్పనిసరి




ప్రీస్కూల్ కిట్టును పరిశీలిస్తున్న శాంతకుమారి

గంట్యాడ: అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి బి.శాంతకుమారి సూచించారు. పెనసాం గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. పిల్లల హాజరు రిజిస్టర్, లబ్ధిదారుల వివరాల రికార్డులను పరిశీలించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం సమకూర్చిన పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలని సూచించారు.

జిల్లాలో కొత్తగా 'విజయనగరం అర్బన్' మండలం

- ప్రైమరీ నోటిఫికేషన్ విడుదల
- 30 రోజుల్లో అభ్యంతరాల స్వీకరణ



విజయనగరం అర్బన్, విజయనగరం రూరల్ పరిధిని తెలిపే మ్యాప్

విజయనగరం అర్బన్: జిల్లాలో కొత్తగా మరో మండలం ఏర్పాటు కానుంది. రాష్ట్రంలో కొత్తగా ఆరు మండలాలను ఏర్పాటుచేస్తూ బుధవారం ప్రభుత్వం ప్రైమరీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆరు జిల్లాల్లో జిల్లా కేంద్రం ఉన్న పట్టణాలను అర్బన్ మండలాలుగా విడదీసింది. ఇందులో భాగంగా విజయనగరం పట్టణానికి ఆనుకుని విజయనగరం అర్బన్ మండలం ఏర్పాటు కానుంది. ప్రస్తుతం విజయనగరం నియోజకవర్గం పరిధిలో 50 డివిజన్‌లతో విజయనగరం కార్పొరేషన్, 22 పంచాయతీలతో విజయనగరం మండలం ఉంది. ఇందులో పట్టణ, రూరల్ పరిధిలోని ప్రాంతాలతో కలిపి కొత్తగా విజయనగరం అర్బన్ మండలం ఏర్పాటు కానుంది. అభ్యంతరాలను, సలహాలు, సూచనలను 30 రోజుల్లోగా కలెక్టర్‌కు తెలియజేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది.

పారావాలీబాల్ ప్రోబబుల్ జట్టుకు సచివాలయ ఉద్యోగి



ప్రోబబుల్ జట్టు అర్హత పత్రాన్ని శ్రీనుకు అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓలు

కొత్తవలస: పారా సిటింగ్ వాలీబాల్ ఏసియన్ కప్ ప్రోబబుల్ జట్టుకు కొత్తవలస మండలం తుమ్మికాపల్లి సచివాలయం డిజిటల్ సహాయకుడు పాటిపిరెడ్డి శ్రీను అర్హత సాధించాడు. ఈ నెల 3,4 తేదీల్లో విజయవాడలో జరగనున్న తుది ఎంపిక పోటీలకు హాజరుకావాలని వచ్చిన ప్రతిని ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, ఎంపీడీఓ వై.పద్మజ బుధవారం శ్రీనుకు అందజేశారు. ప్రోబబుల్ జట్టుకు దేశవ్యాప్తంగా 25 మంది అర్హత సాధించారని, విజయవాడలో జరిగే పోటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 16 మందిని ఏసియన్ కప్ ఆడే జట్టుకు భారత్ తరఫున ఎంపిక చేస్తారని శ్రీను తెలిపాడు.

మడ్డువలసకు మహర్దశ

- రూ.3.70 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ప్రాజెక్టుకు నిధులు
- టీడీపీ హయాంలో పట్టించుకోని వైనం
- ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుడుతున్న అధికారులు

మడ్డువలస ప్రాజెక్టు



వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు శుభవార్త. ప్రాజెక్టు ఆధునికీకరణ పనులకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దశల వారీగా వివిధ అభివృద్ధి పనులు చేసేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. టీడీపీ హయాంలో ప్రాజెక్టు అభివృద్ధిని గాలికి వదిలేశారు. స్థానిక పాలకుల వినతి మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాజెక్టు పనులపై దృష్టిసారించింది. రైతుల సాగునీటి కష్టాలను దూరం చేసేలా పనులు నిర్వహిస్తోంది.

గతంలో ఇలా..

2008లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి మడ్డువలస ఆధునీకరణ పనులకు రూ.47 కోట్లు నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన మరణాంతరం పనులు నత్తనడకన సాగాయి. 2019 వరకు 50 శాతం పనులు కూడా జరగలేదు. ప్రాజెక్టు వద్ద ఎటువంటి అభివృద్ధి జరగలేదు. మరమ్మతుల పనులు కూడా సాగలేదు. కనీసం విద్యుత్ దీపాల ఏర్పాటు, జంగిల్ క్లియరెన్స్ వంటివి కూడా చేపట్టలేదు.

ప్రస్తుతం..

2019లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనంతరం గడిచిన మూడేళ్లలో సుమారు రూ.10 కోట్లతో కాలువల ఆధునీకరణ పనులు చేపట్టారు. తాజాగా ప్రాజెక్టు వద్ద అభివృద్ధి చేసేందుకు మూడు రకాల పనులకు రూ.3.70 కోట్లు నిధులు మంజూరైనట్టు డీఈ నర్మదాపట్నాయక్ తెలిపారు. ఇందులో భాగంగా 2022 ఏప్రిల్‌లో మంజూరైన రూ.40 లక్షలతో ప్రాజెక్టు వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహణ, రోప్స్‌కు గ్రీజు, కెమికల్స్ పూయడం, ఎలక్ట్రికల్ పనులు, జనరేటర్ మరమ్మతులతో పాటు పెండింగ్ పనులు చేపడతారు. 2022 సెప్టెంబర్‌లో రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి.



ఇలాంటి లీకేజీలు ఇక ఉండవు..



ప్రాజెక్టు వద్ద జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులు

ఈ నిధులతో ప్రాజెక్టు వద్ద ఉన్న 11 గేట్లు మరమ్మతులు, లీకుల నివారణ, గేట్లుకు రబ్బర్ సీల్స్ మార్పిడి, కొత్త రోప్స్ ఏర్పాటు, బ్రిడ్జి పెయింటింగ్ వంటి పనులు చేపడతారు. 2020లో అత్యవసర గేట్లు ఏర్పాటుకు రూ.1.50 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో ప్రస్తుతం జరుగుతున్న పనులతో కలిపి అత్యవసర గేట్లు ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

నీరు నిల్వ కోసం..

ప్రాజెక్టు వద్ద ప్రధాన గేట్లు మరమ్మతులు సమయంలో ప్రాజెక్టులో ఉన్న నీటిని ఖాళీ చేసే (ప్రాజెక్టులో ఉన్న పూర్తి నీటిని కిందకు విడిచిపెట్టడం) పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ప్రధాన గేట్లు మరమ్మతుల కోసం ప్రాజెక్టులో ఉన్న 62.33 మీటర్లు లెవెల్ నీటిని దశల వారీగా కిందకు విడిచిపెడతారు. అయితే ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.50 కోట్లతో మిగిలిన అభివృద్ధి పనులతో పాటు కొన్ని అత్యవసర గేట్లు తొలిదశలో ఏర్పాటు చేస్తారు. వీటిని పూర్తి స్థాయిలో అమర్చితే ఎటువంటి సందర్భంలోనూ నిల్వ చేసిన నీటిని కిందకు విడిచిపెట్టాల్సిన అవసరం ఉండదు. ఈ దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. దీని కోసం రూ.1.50 కోట్లుకు బదులుగా మరో అదనంగా కోటి రూపాయలు ఉంటే అత్యవసర గేట్లు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

ప్రాజెక్టు స్థితి గతులు ఇలా...

మడ్డువలస ప్రాజెక్టులో 65 మీటర్ల మేర నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం(3.373 టీఎంసీలు) ఉంది. ఆయకట్టు విస్తీర్ణం 31వేల ఎకరాలు. వంగర, రేగిడి, సంతకవిటి, రాజాం, జి.సిగడాం, పొందూరు, లావేరు, ఎచ్చెర్ల, రణస్థలం మండలాలకు సాగునీరు అందుతుంది. కుడి ప్రధాన కాలువ పొడవు 50 కిలోమీటర్లు. ఎడమ కాలువ పొడవు 3 కిలోమీటర్లు.

పనులు ప్రారంభించాం.....



మడ్డువలస ప్రాజెక్టు వద్ద అభివృద్ధి పనులు ప్రారంభించాం. తొలుత జంగిల్ క్లియరెన్స్ పనులు అనంతరం గేట్లు మరమ్మతులు, అత్యవసర గేట్లు ఏర్పాటు, విద్యుదీకరణ, రోప్స్ ఏర్పాటు, బ్రిడ్జి పెయింటింగ్ పనులు చేపడతాం. అవసరం మేరకు దశల వారీగా ప్రాజెక్టులో ఉన్న నీటిని కిందకు మళ్లిస్తున్నాం.

– నర్మదా పట్నాయక్, డీఈ, మడ్డువలస

కనకమహాలక్ష్మి జాతర ఆదాయం రూ.21,24,878లు

- హుండీల ద్వారా రూ.12,89,932
- టిక్కెట్ల అమ్మకం రూపంలో రూ.7,05,750

చీపురుపల్లి: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. గతనెల 26, 27, 28 తేదీల్లో అమ్మవారి 25వ జాతర సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. కేశఖండన, మొక్కుబడులు, దర్శనం టిక్కెట్లు, హుండీలు, డొనేషన్లు, చీరల వేలంపాట ద్వారా మొత్తం రూ.21,24,878లు ఆదాయం లభించిందని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పి.వి.లక్ష్మి, దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరుకుమార్ వెల్లడించారు. హుండీల ద్వారా రూ.12,89,932లు, రూ.100 దర్శనం టిక్కెట్ల విక్రయంతో రూ.2,64,500, రూ.30 దర్శనం టిక్కెట్ల అమ్మకంతో రూ.2,72,070, రూ.20 దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.1,69,180 ఆదాయం లభించింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గంట్యాడ బుజ్జి, కంది శ్రీరాములు, వంకల కృష్ణ, అలిగి శ్రీను, అడ్డాల రవి, ఈఓ జి.శ్రీనివాస్, అలయ అర్చకుల రవిశర్మ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

సూర్యోదయానికి ముందే...



విజయనగరం గొల్లవీధిలో షేక్ మదీనాకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సౌజన్య



విజయనగరం రాజీవ్‌నగర్ కాలనీలో వృద్ధురాలు రాధకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ సత్య



ఘోషాస్పత్రిలో కె.లక్ష్మికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ శ్రావణి



విజయనగరం సర్వజన ఆస్పత్రిలో వేపాడపు సత్యంకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ విజయకుమార్

విజయనగరం అర్బన్: ఒకటో తేదీ వచ్చింది. పల్లెలు, పట్టణాల్లో పింఛన్ల పంపిణీ సందడి మొదలైంది. బుధవారం తెలతెలవారుతుండగానే వలంటీర్లందరూ పింఛన్‌దారుల తలుపు తట్టి వైఎస్సార్ పింఛన్ కానుకలను అందజేశారు. ఒకటోతేదీన విజయనగరం జిల్లాలో 86.72 శాతం మందికి పింఛన్ల పంపిణీ చేయడంతో రాష్ట్రస్థాయిలో జిల్లా నాలుగోస్థానంలో నిలిచిందని డీఆర్‌డీఏ పీడీ కళ్యాణిచక్రవర్తి తెలిపారు. జిల్లాలోని 14 రకాల పెన్షన్‌లు 2,79,792 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా, తొలిరోజు 2,42,645 మందికి పంపిణీ చేశారు. 93.09 శాతం పంపిణీ చేసి కొత్తవలస మండలం ముందు వరుసలో ఉండగా, 92 శాతం దాటి పంపిణీ చేసిన మండలాల్లో విజయనగరం అర్బన్, నెల్లిమర్ల అర్బన్ ఉన్నాయి. 91 శాతం దాటి పంపిణీ చేసిన మండలాల్లో విజయనగరం మండలం, తరువాత 90 శాతం దాటిన మండలాల్లో డెంకాడ, బొండపల్లి, రాజాం అర్బన్ ఉన్నట్టు పీడీ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సదుపాయాలు

- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

విజయనగరం: పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి స్థానం కోసం ఈ నెల 13న జరగనున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎస్పీ దీపికా పాటిల్‌తో కలిసి పరిశీలించారు. విజయనగరం కంటోన్మెంట్‌లోని మున్సిపల్ ఉన్నత పాఠశాల, మహారాజా కళాశాల, కస్పా మున్సిపల్ ఉన్నత పాఠశాల, మహారాజా సంస్కృత ఉన్నత పాఠశాలల్లో సౌకర్యాలను తనిఖీ చేశారు. ఓటర్లకు తాగునీటి సదుపాయం కల్పనతో పాటు గదుల్లో లైట్లు, ఫ్యాన్లు పనిచేసేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలవద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పీ తెలిపారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ చేయాలి

గ్రాడ్యుయేట్ ఓటర్లకు ఓటర్ స్లిప్పుల పంపిణీ త్వరగా పూర్తి చేయాలని బీఎల్‌ఓలకు కలెక్టర్ ఆదేశించారు. తక్కువ స్లిప్పులను పంపిణీ చేసినవారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంపిణీ శతశాతం జరగాలని, స్వయంగా వెళ్లి స్లిప్పులను ఓటర్లకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ ఎన్నికల అధికారులు పి.ఎ.వి.లక్ష్మీనారాయణ, బి.రాంగోపాల్, విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దార్ బంగార్రాజు, ఇతర రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పనపై ఆరా తీస్తున్న కలెక్టర్, ఎస్పీ

వైఎస్సార్, జగన్ పాలనలోనే యువతకు మేలు



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పోస్టర్లు విడుదల చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఇతర నాయకులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి:

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి హయాంలోనే రాష్ట్రంలోని యువతకు మేలు జరిగిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. చీపురుపల్లి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, సచివాలయ కన్వీనర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ ఆచరణలోకి తెచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వల్ల ఎంతో మంది గ్రామీణ యువత ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు చదువుకున్నారని చెప్పారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థతో రాష్ట్ర వ్యాప్తంగా 1.5 లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. పోలీస్, వైద్య ఆరోగ్యశాఖలో గతంలో ఎన్నడూ లేనంతగా ఉద్యోగ నియామకాలు చేపట్టిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్యారంగ అభివృద్ధికి గడిచిన మూడేళ్లలో రూ.36 వేల కోట్లు వెచ్చించారన్నారు. టీడీపీ హయాంలో నిరుద్యోగ భృతి ఇస్తామని, బాబు వస్తే జాబు వస్తుందని అబద్ధపు హామీలు ఇచ్చి యువతను మోసం చేశారని గుర్తుచేశారు. అశోక్‌గజపతిరాజు యువత కోసం మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరుగుతున్న మంచిని వివరించాలన్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, పార్టీ బలపరిచిన అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.వి.సూర్యనారాయణ, ఎస్.వి.రమణరాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, దన్నాన జనార్దన్, పతివాడ రాజారావు, తాడ్డి వేణు, వి.శ్రీను, ఎం.విశ్వేశ్వరరావు, పి.కుమార్, శీర అప్పలనాయుడు, పి.సన్యాసినాయుడు, బి.బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో నంబర్ 1



గంట్యాడ మండలంలో పనిచేస్తున్న వేతనదారులు

- నగటున రోజుకు లక్షా 17 వేలమందికి పనికల్పన
- జిల్లాలో జాబ్ కార్డులు 3.48 లక్షలు
- వీటి పరిధిలో వేతనదారులు 6.06 లక్షల మంది

విజయనగరం ఫోర్ట్:

జిల్లా అధికారుల 'ఉపాధి' ప్రణాళిక ఫలిస్తోంది. గ్రామసభల్లో గుర్తించిన పనుల ప్రణాళికను పక్కాగా అమలుచేయడంతో ప్రస్తుత వేసవి కాలంలో ఉపాధిహామీ పనులు జోరందుకున్నాయి. చెరువులు, సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చకచకా సాగుతున్నాయి. రైతుల భూముల అభివృద్ధి పనులు, ప్లాంటేషన్, మట్టిరోడ్ల జంగిల్ క్లియరెన్స్ పనులు ఊపందుకున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారులకు పని కల్పించడంలో విజయనగరం జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రతి రోజు లక్ష మందికి పైగా వేతనదారులు పనికి హాజరవుతున్నారు.

జాబ్‌కార్డులు ఇలా..

జిల్లాలో ఉపాధిహామీ జాబ్ కార్డులు 3.80 లక్షలు ఉన్నాయి. వీటిలో 3.48 లక్షల కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. మొత్తం 6.98 లక్షల మంది వేతనదారులు నమోదు కాగా, 6.06 లక్షల మంది వేతనదారులు పనులు చేసేందుకు అర్హులై ఉన్నారు. వీరిలో ప్రస్తుతం రోజుకు 1.17లక్షల మంది పనికి వెళ్తున్నారు. పనికి వచ్చేవారందరికీ అధికారులు పని కల్పిస్తున్నారు.

గిట్టుబాటు వేతనం

ఉపాధిహామీ వేతనదారులకు గిట్టుబాటు వేతనం వచ్చేలా ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది కొలతల ప్రకారం పనులు అప్పగిస్తున్నారు. రెండు పూటలా పనులు సాగిస్తున్నారు. అధిక మంది వేతనదారుల ఖాతాలకు రోజుకు రూ.220 పైబడి వేతనం జమవుతోంది.

ప్రణాళికా బద్ధంగా..

గ్రామసభల్లో గుర్తించిన మేరకు జిల్లాలో పనులు చేస్తున్నాం. వ్యవసాయ పనులు ముగియడంతో అధికమంది వేతనదారులు పనికి హాజరవుతున్నారు. పనికి వచ్చేవారందరికీ పని చూపిస్తున్నాం. రోజుకి లక్ష మందికి పైగా వేతనదారులు పనికి వస్తున్నారు. రోజు వారీ పని కల్పనలో విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం గర్వంగా ఉంది.

– జి.ఉమాపరమేశ్వరి, డ్వామా పీడీ

క్లుప్తంగా

లారీ బోల్తా
- డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు


కొమరాడ మలుపు వద్ద బోల్తా పడిన లారీ

కొమరాడ: మండల కేంద్రం కొమరాడ పోలీస్ స్టేషన్ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న మలుపు వద్ద బుధవారం తెల్లవారు జామున రాయగడ నుంచి పార్వతీపురం మాంగనీస్ లోడుతో వస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్, క్లీనర్ గాయాల పాలయ్యారు. గమనించిన స్థానికులు వారిద్దరినీ పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. కొమరాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం దగ్ధం


కాలిపోయిన ధాన్యం బస్తాలు

సీతానగరం: మండలంలోని కేపేస్ పురంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.90 వేల విలువైన ధాన్యం దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రెడ్డి కాశినాయుడి ధాన్యం 60 బస్తాలు, యామల అప్పారావుకు చెందిన 45 ధాన్యం బస్తాలు, యామలప్రసాద్‌కు చెందిన 6 బస్తాల ధాన్యం కాలిపోయాయి. అలాగే మంటల్లో ఆరుగురికి చెందిన పది వరిగడ్డి కుప్పలు కాలిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు బొబ్బిలి నుంచి అగ్నిమాపక శకటంతో వచ్చిన సిబ్బంది మంటలను అదుపుచేశారు. అగ్ని ప్రమాదం జరిగిందన్న సమాచారం మేరకు ఆర్ఐ కరుణాకర్, ఎస్సై కె.నీలకంఠం, వీఆర్వో ఉదయ్, సర్పంచ్ యు.జయలక్ష్మి, ఎంపీటీసీ వై.అరుణకుమారి అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించారు.

కదులుతున్న రైలెక్కుతుండగా ప్రమాదం


రైలునుంచి జారిపడిన మహిళకు ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

విజయనగరం క్రైమ్: కదులుతున్న రైలెక్కేందుకు చేసిన ప్రయత్నంలో ఓ మహిళ జారిపడి గాయాలపాలైంది. ఈ మేరకు రైల్వే ఆర్‌పీఎఫ్ సిబ్బంది బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి విశాఖ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ కదులుతుండగా మామిడి నర్మద(24) ఎక్కేందుకు ప్రయత్నించి జారి పడిపోవడంతో ప్రమాదంలో ఎడమచేయి, నడుము భాగం దెబ్బతిన్నాయి. ప్రమాదాన్ని గమనించిన ఆర్‌పీఎఫ్ అధికారులు సమాచారం అందించడంతో స్టేషన్‌కు వచ్చిన 108 సిబ్బంది కామేశ్వరి, పైలట్ కోటేశ్వరరావులు బాధితురాలికి ప్రథమ చికిత్స చేసి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

లావేరు: బుడుమూరు గ్రామం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు లావేరు పోలీసులు బుధవారం తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి తమ సిబ్బంది గస్తీ తిరుగుతుండగా బుడుమూరు గ్రామం వద్ద ఉన్న ఫ్లైఓవర్ కిందన గల సర్వీసు రోడ్డులో మృతదేహం ఉండటాన్ని గుర్తించినట్టు చెప్పారు. విషయం ఉన్నతాధికారులకు చేరడంతో ఎస్సై కోటేశ్వరరావు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వద్ద విశాఖపట్నం నుంచి రాజాంకు వెళ్లే బస్సు టిక్కెట్టు మాత్రమే ఉన్నట్టు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

బాలలూ భళా..!

- తప్పెటగుళ్ల ప్రదర్శనతో చిన్నారులు బిజీ
- పలువురి అభినందనలు
- కోమటపల్లి సాంబమూర్తి కళాక్షేత్రంలో శిక్షణ


గురువు శంకరరావుతో చిన్నారులు


అబ్బుర పరుస్తున్న చిన్నారుల తప్పెటగుళ్ల ప్రదర్శన


మన్యం జిల్లాలో సంబరాల్లో చిన్నారులు


కోమటిపల్లిలో శిక్షణ పొందుతున్న కళాకారులు

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటపల్లికి చెందిన చిన్నారులు అంతరించి పోతున్న పల్లెకళలను బతికిస్తూ, అందరినీ అలరిస్తున్నారు. తప్పెటగుళ్ల ప్రదర్శనలతో కోమటపల్లికి చెందిన పాఠశాల విద్యార్థులు బారు సత్యనారాయణ, నీలాపు ఉపేంద్ర, పెద్దింటి అశ్విని, కోస్ది సంధ్య, కోస్ది రాజేష్, బారు బాలాజీ, వెలమల ప్రసాద్, బొంతలకోటి పేర్నిదేవి, శిఖా పవన్, పెంట గణేష్‌లు తప్పెటగుళ్ల ప్రదర్శనలు ఇస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఏ గ్రామంలో సంబరాలు, జాతరలు జరిగినా ఈ చిన్నారుల ప్రదర్శన ఉండాల్సిందే అంటే అతిశయోక్తి కాదు. కోమటపల్లికి చెందిన తూర్పుభాగవతార్ బొంతలకోటి శంకరరావు తన తండ్రి జ్ఞాపకార్థం నిర్మించిన సాంబమూర్తి కళాక్షేత్రంలో పలు జానపద కళలపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఆయన దగ్గర శిక్షణ పొందిన చిన్నారుల ప్రదర్శనలు వీక్షించిన బొబ్బిలి డీఎస్పీ మోహనరావు, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉష, పార్వతీపురం మన్యం జిల్లా అధికారులు వారిని అభినందించారు.

నాడు-నేడు రెండోవిడత పనులు వేగవంతం చేయండి

- డీఈఓ ఎస్‌డీవీ రమణ


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి ఎస్డీవీ రమణ

పార్వతీపురంటౌన్:

పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండోవిడత నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డీవీ రమణ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో కూడిన నిర్మాణాలను తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించారు. అలాగే పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకంలో అక్రమాలకు తావులేకుండా నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందజేయాలని చెప్పారు. అవకతవకలు పాల్పడితే శాఖాపరమైన చర్యలు చేపడతా మని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు, విజయకుమారి, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

స్కార్పియో ఢీకొని వ్యక్తి మృతి


మృతిచెందిన ఈగల కృష్ణ

విజయనగరం క్రైమ్: మండల పరిధిలోని గొల్లలపేట బైపాస్ రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి రూరల్ పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొల్లలపేట గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బైపాస్ రోడ్డులో చెల్లూరు నుంచి సాలూరు వైపు స్కార్పియో వాహనం వెళ్తోంది. ఎదురుగా సీడీ డీలక్స్ బైక్‌పై గొల్లలపేటకు చెందిన తండ్రీకొడుకులు, ఈగల కృష్ణ (60), రామకృష్ణలు వస్తూ రోడ్డు అవతలి వైపునున్న గొల్లలపేటకు వెళ్లేందుకు తిరుగుతున్న సమయంలో వారి బైక్‌ను స్కార్పియో బలంగా ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడి గాయాలపాలైన తండ్రీకొడుకులను 108 సాయంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఈగల కృష్ణ మృతిచెందాడు. రామకృష్ణ పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై బి.గణేష్ తెలిపారు.

బ్లేడ్‌తో కోసుకుని ఆత్మహత్యా యత్నం


చికిత్స పొందుతున్న ఆదినారాయణ

పార్వతీపురం: కుమారుడు మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని మనస్తాపం చెందిన ఓ తండ్రి బ్లేడుతో కోసుకుంటానని బెదిరించి ఆత్మహత్యాయత్నం చేశాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం రావుపల్లి గ్రామానికి చెందిన బొంతాడ ఆదినారాయణ..మద్యం తాగడానికి కుమారుడు సింహాచలాన్ని డబ్బులు అడిగాడు. కుమారుడు డబ్బులు ఇవ్వకపోవడంతో తాను తీసుకువచ్చిన బ్లేడ్‌తో మెడ మీద కోసుకుంటానని బెదిరించి కోసుకుని గాయాల పాలయ్యాడు. విషయం గమినించిన స్థానికులు గరుగుబిల్లి పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరంమెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంకెతోనే లంకె..!

- ఎమ్మెల్సీ ఎన్నికకు గుర్తులుండవు
- ఓటుగా నంబర్ మాత్రమే వేయాలి
- మార్గదర్శకాలు విడుదల చేసిన ఎలక్షన్ కమిషన్

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నిక జరగనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ విధానం సార్వత్రిక ఎన్నికలకు భిన్నంగా ఉంటుంది. ఈ ఎన్నికలకు అభ్యర్థులకు ఎదురుగా బ్యాలెట్ పేపర్‌పై గుర్తులు ఉండవు. అభ్యర్థుల పేర్లు మాత్రమే ఉంటాయి. ఓటరు పేరుకు ఎదురుగా అంకెతోనే ఓటు వేయాలి. ఓటరు ప్రాధాన్యతా క్రమంలో అభ్యర్థులందరికీ ఓటు వేయవచ్చు. ఓటు ఎలా వేయాలి? ఎలా వేయకూడదు? అనే అంశాలను పొందుపరుస్తూ అవగాహన కలిగించడానికి ఎన్నికల కమిషన్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఆ వివరాలిలా ఉన్నాయి.

ఓటు ఎలా వేయాలంటే..

ఓటరుకు ఇచ్చిన బ్యాలెట్ పేపర్ మీద అభ్యర్థుల పేర్లు ఫొటోలు ఉంటాయి
- మొదటి ప్రాధాన్యం ఇచ్చే అభ్యర్థుల ఎదురుగా 1, 2, 3 నంబర్లు లేదా రోమన్ అంకెలు వేయాలి
- పోలింగ్ కేంద్రాల్లో ఇచ్చే పెన్ మాత్రమే వాడాలి
- ఓటు వేసేందుకు వెళ్లేటపుడు ఐడీ ప్రూఫ్ తీసుకుని వెళ్లాలి.
- బూత్ లోపలికి వెళ్లే ముందు పేరు చూసుకుని సంతకం పెట్టాలి
- బూత్ బయట ఓటర్ లిస్టులో పేరు, క్రమసంఖ్య చూసుకోవాలి.

ఎలా వేయకూడదంటే..

- సొంత పెన్ వాడకూడదు
- ఒకే నంబర్ ఇద్దరు అభ్యర్థులకు ఇవ్వకూడదు
- ఒకటి అని రాయకూడదు. ఇంగ్లిష్‌లో కూడా వన్ అని రాయకూడదు
- బ్యాలెట్ పేపర్‌లో ఎక్కువ పేర్లు ఉంటాయి. ఆ పేర్లలో నచ్చిన వారికి 1వ నంబర్ వేయాలి
- బ్యాలెట్ పేపర్ ఎన్నికల అధికారులు చెప్పే పద్ధతులలో ఫోల్డ్ చేసి వేయక పోతే ఇన్‌వ్యాలిడ్‌గా పరిగణిస్తారు
- నంబర్స్ గట్టిగా పెన్‌తో దిద్దరాదు.
- అభ్యర్థి పేరు, బాక్స్ పక్కనే ఓటు వేయకుండా మిగతా చోట్ల వేస్తే చెల్లదు
- అభ్యర్థులు ఎక్కువ ఉంటే అందరికీ నంబర్స్ వేయవలసిన అవసరం లేదు.

పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిషేధం

- సీఈఓ ఎం.కె మీనా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్


వీసీ నిర్వహిస్తున్న రాష్ట్ర ఎన్నికల అధికారి ఎంకె.మీనా

పార్వతీపురం: పాఠశాలల ప్రాంగణాల్లో ఎన్నికల ప్రచారాలు నిషేధమని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) ఎం.కె మీనా స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనరాదని, కరపత్రాలు, పోస్టర్ల పంపిణీ వంటి చర్యలు చేపట్టినా, ప్రచారంలో పాల్గొన్నట్లు భావించాల్సి వస్తుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ ఉండాలని సూచించారు. పార్వతీపురం మన్యం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరుగుతుందన్నారు. సూక్ష్మ పరిశీలకులు, సాధారణ పరిశీలకులకు ఫిబ్రవరి 27న, పోలింగ్ సిబ్బందికి ఫిబ్రవరి 28న శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. జిల్లాలో 18,520మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారన్నారు. జిల్లాలో 8 పోలింగ్ కేంద్రాలు సున్నితమైన కేంద్రాలుగా పరిగణిస్తున్నామన్నారు. అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులు నాలుగు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలకు బందోబస్తు ఏర్పాటు చేశామని, రూట్, మొబైల్‌ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్సులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్‌ఓ జె.వెంకట్రావులు పాల్గొన్నారు.

అటవీశాఖకు ఆదాయం


జిల్లా అటవీశాఖ కార్యాలయ ప్రాంగణంలో వేలంపాటకు సిద్ధంగా ఉన్న టేకు లాట్లు

- ఆరు దశాబ్దాల నాటి టేకు చెట్ల వేలం
- మార్చి8, 20 తేదీల్లో పాట

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాల్లో 60 ఏళ్ల క్రితం నాటిన టేకుచెట్లను నరికి అటవీశాఖ ఆధ్వర్యంలో అమ్మకాలు చేపట్టడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. గడిచిన 1957,1959,1960వ సంవత్సరాల్లో జిల్లాలోని గంటికొండ ప్రాంతంలో నాటిన మొక్కలకు ఈ దశాబ్దానికి 60 ఏళ్ల పూర్తికావడంతో 2,026 చెట్ల అమ్మకాల ద్వారా ఆదాయం వస్తోంది.అలాగే ఈ ఏడాదితో 60 సంవత్సరాలు పూర్తయిన 313 చెట్ల కటింగ్‌కు అనుమతి ఇచ్చారు. వాటి ద్వారా సుమారు 80 సీఎంటీల కలప వచ్చింది. ఈ కలప ఈ నెల 8,20 తేదీల్లో వేలం పాటద్వారా అమ్మకాలు చేపతారు.ఆసక్తిగలవారు అందులో .పాల్గొనవచ్చునని అటవీ అధికారులు చెబుతున్నారు.

ఈ నెలలో టేకు వేలం పాట



ఈ ఏడాదితో 60 ఏళ్ల పూర్తయిన 313 టేకు చెట్ల లాట్లకు మార్చి 8, 20వ తేదీల్లో వేలం పాట నిర్వహించి అమ్మకాలు చేపడతాం. గడచిన మూడేళ్లల్లో 2026 చెట్ల ద్వారా 524.2092 సీఎంటీల కలప రాగా దాని ద్వారా రూ.2కోట్ల 51లక్షలు 83వేల ఆదాయం వచ్చింది.

– ఎస్ వెంకటేష్,జిల్లా అటవీ అధికారి, విజయనగరం

టేకు ప్లాంటేషన్	చెట్లు	చెట్ల పరిమాణం	వచ్చిన ఆదాయం
1957 గంటికొండ	662	217.3675	రూ.1,02,35,400
1959 గంటికొండ	627	172.0717	రూ.87,84,150
1960 గంటికొండ	737	134.7700	రూ.61,64,050
2026	524.2092	రానున్న ఆదాయం రూ.2,51,83,600	

ముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో ఉండాలి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి


తిరుమల ఆలయం వెలుపల అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

తిరుమల/కాణిపాకం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఆయురారోగ్యాలు, రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు నడిపేందుకు అవసరమయ్యే శక్తిని ప్రసాదించాలని తిరుమల శ్రీవారిని వేడుకున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చెప్పారు. ఈ మేరకు బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెలలో జరగబోయే శాసనసభ బడ్జెట్ సమావేశాలు సాఫీగా సాగాలని, ఈ సమావేశాలకు ఎటువంటి అవరోధం కలిగించకుండా ప్రతిపక్షానికి మంచి జ్ఞానం కలిగించాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ బడ్జెట్ అందరికీ ఆశాజనకంగా ఉంటుందన్నారు. బడ్జెట్‌లో ఎటువంటి అంశాలపై చర్చించాలనే అజెండా సిద్ధం చేస్తున్నారని, ప్రజలకు ఉపయోగపడే అంశాలు ప్రవేశపెడతామని తెలియజేశారు.

శాశ్వత లోక్ అదాలత్ ప్రారంభం

- సత్వర న్యాయం పొందేందుకు ఉత్తమ వేదిక
- పది రకాల ప్రజాసేవలపై ఆశ్రయించే అవకాశం
- అయితే రాజీ, లేదా తుదితీర్పు ఇక్కడే
- ప్లాపస్ చైర్మన్ జి.దుర్గయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ప్లాపస్ చైర్మన్ గరికిన దుర్గయ్య


శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ దుర్గయ్యను కలిసిన న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

విజయనగరం లీగల్:

సత్వర న్యాయం పొందేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలకు శాశ్వత లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందని ప్లాపస్ (పర్మినెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్) ఛైర్మన్ గరికిన దుర్గయ్య అన్నారు. ఉచితంగా, వేగంగా న్యాయం పొందేందుకు ఇదొక ఉత్తమ వేదిక అని ఆయన తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు శాశ్వత లోక్ అదాలత్‌ను స్థానిక జిల్లా కోర్టు సముదాయంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవలే జిల్లాకు మంజూరైన శాశ్వత లోక్ అదాలత్‌ను, ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ప్రారంభించినట్లు తెలిపారు.

కొత్త కేసులే విచారణ

న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి సాధారణంగా మూడునెలలకోసారి జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తామని, కానీ ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో కొత్త కేసులను మాత్రమే విచారణ చేస్తామని చెప్పారు. ఇక్కడ విచారించే కేసుల్లో రాజీ కుదరకపోతే, తుది తీర్పు కూడా ఇక్కడే ఇస్తామని, మరో న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం లేదని స్పష్టం చేశారు. బాదితులు లేదా సాధారణ పౌరులు న్యాయవాది ద్వారా గానీ, లేదా నేరుగా గానీ తమను ఆశ్రయించి, న్యాయం పొందవచ్చునని తెలిపారు. ఇదే అంశానికి సంబంధించి వారు ఇంతకుముందు ఇతర కోర్టుల్లో కేసు వేయలేదని నిర్ధారించవలసి ఉంటుందన్నారు. ప్రధానంగా పది రకాల ప్రభుత్వ, ప్రభుత్వేతర ప్రజా సేవలకు సంబంధించి, తమను ఆశ్రయించవచ్చునని తెలిపారు. పరిహారం సుమారు కోటి రూపాయలు వరకు అవకాశం ఉన్న కేసులు తమ పరిధిలోకి వస్తాయని శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ దుర్గయ్య తెలిపారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవల సంస్థ కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

ప్లాపస్ చైర్మన్‌ను కలిసిన బార్ అసోసియేషన్

శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్‌గా నియమితులైన దుర్గయ్యను స్థానిక న్యాయవాదుల సంఘం ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన చాంబర్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల రాష్ట్రంలో ఖాళీగా ఉన్న శాశ్వత లోక్ అదాలత్‌లకు చైర్మన్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.